
మనవాళ్ళు

# కీ.శే. డా॥ముద్దన హనుమంతరావు

యు. వెంకట సుబ్బయ్య,
విశ్రాంత భౌతికశాస్త్ర శాఖాధిపతి, జె.కె.సి. కళాశాల.

డా॥ముద్దన హనుమంతరావు గారు తిమ్మ సముద్రం గ్రామములో (నాగులుప్పలపాడు మండలము, ప్రకాశము జిల్లా) సామాన్య రైతు కుటుంబము నందు, ముద్దన వీరాస్వామి, నారాయణమ్మ దంపతుల ఏకైక పుత్రుడుగా జన్మించారు. డా॥ హనుమంతరావు ప్రాథమిక, సెకండరీ విద్యాభ్యాసం తిమ్మసముద్రములో చేసి కాలేజి విద్య గుంటూరులోని ఏ.సి. కాలేజిలో పూర్తిచేసాడు. తరువాత వైద్యవిద్య ఆంధ్రా మెడికల్ కాలేజి విశాఖ పట్టణములో రెండు సంవత్సరములు తరువాత గుంటూరు మెడికల్ కాలేజికి మార్చుకొని యం.బి.బి.యస్., పూర్తిచేశారు.



8-11-1942 8-8-2009

డా॥ హనుమంతరావుకు నాకు మధ్య దూరపు బంధుత్వము వున్నప్పటికిని స్నేహ బంధమే మమ్మల్ని సన్నిహితులను చేసింది. నేను చీరాలలో డిగ్రీ పూర్తి చేసి విశ్వవిద్యాలయ విద్యకై విశాఖపట్టణము వెళ్లాను. డా॥హనుమంతరావు గారు, నేను కలుస్తుండే వాళ్లము. ఈ విధంగా మా విద్యాభ్యాసము కూడా చాలా సన్నిహితంగా జరిగింది.

వైద్య పట్టా అందుకొన్న డా॥ హనుమంతరావు మెడికల్ ప్రాక్టీసును **ఆదర్శ నర్సింగ్ హోమ్** పేరున గుంటూరులో ప్రారంభించారు. పేదలకు వైద్యం చేస్తూ పేదల డాక్టరుగా మంచి పేరు తెచ్చుకున్నాడు. అప్పటికే నేను ఏ.సి.కాలేజిలో అధ్యాపక వృత్తిలో చేరినందున, మా స్నేహబంధము ఆయన తుది శ్వాస వరకు కొనసాగింది.

గ్రామీణ పేద విద్యార్థులకు సహాయ సహకారములు అందించాలనే ప్రస్తావన వచ్చేది) ఈ కారణంగానే డా॥ బసవపున్నయ్యగారి ప్రమేయముతో అరండల్‌పేటలోని కమ్మ హాస్టల్ విద్యార్థులకు ఆర్థిక / ఉచిత బోజన సహాయము చేసేవారు. సినీ కళాకారుల సహకారంతో నాటక ప్రదర్శన జరిపి, వచ్చిన డబ్బుతో పేద విద్యార్థుల సహాయ నిధి పేరున అరండల్‌పేట కమ్మ హాస్టల్ పేద విద్యార్థులకు ఉచిత బోజనం ఏర్పాటు చేశారు. గుంటూరు పట్టణ కమ్మజన సేవా సమితి సెక్రటరీ బాధ్యతలు చేపట్టి కమ్మజన ప్రముఖుల సహకారంతో స్థలము సేకరించి, లారీ ఓనర్స్ సహాయంతో ఆ స్థలపు గుంటలను మట్టితో నింపి సభా వేదిక నేర్పరచి రెండు గదుల షెడ్డు నిర్మాణము చేశారు. అదే స్థలములో సాంస్కృతిక వేదిక నేర్పరచి మరుగున పడిన కళలకు ప్రోత్సహమిచ్చారు. ఈ స్థలములోనే ప్రస్తుతము హాస్టల్ కట్టబడి శోభిల్లుచున్నది. సినీ రచయిత కొసరాజు రాఘవయ్య గారి **గండికోట రహస్యము** పుస్తక ప్రచురణ, తుమ్మల కళాపీఠం ఏర్పరచి, తుమ్మల సీతారామమూర్తిగారి ఏటుకూరి వెంకటనరసయ్య గారి రచనలు ప్రచురించారు. డా॥ పులిచెర్ల సాంబశివరావు గారు రచించిన రామాయణ గ్రంథ ప్రచురణకు ఆర్థిక సహాయము చేసాడు. జె.కె.సి.కాలేజికి సంబంధించిన నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటి కమిటిలో ఎగ్జిక్యూటివ్ మెంబరుగా తన సహకారమునందించి అనేక కొత్త విద్యా సంస్థలు ప్రారంభించుటకు ప్రోత్సహించారు.

తరువాత రాజకీయములలో ప్రవేశించి భారతీయ జనతాపార్టీ తరపున గుంటూరు నుండి పార్లమెంటరీ అభ్యర్థిగా పోటీచేసారు. కాని రాజకీయాలు నచ్చక కొద్ది సంవత్సరములలోనే ప్రక్కను తొలిగాడు. వ్యవసాయము మీద వున్న మక్కువతో నందిగామ (కృష్ణాజిల్లా) ప్రాంతములో వ్యవసాయము చేపట్టి వైద్యవృత్తి చేస్తూ అక్కడే నివాసము ఏర్పరచుకున్నాడు. ఈ విధంగా జీవన ప్రయాణం సాగించిన డా॥హనుమంతరావుగారు 2005లో ప్రాణాంతకమయిన కాన్సర్ వ్యాధి బారిన బడి, తన కోరిక ప్రకారము అరండల్‌పేటలోని ఆర్య సమాజ మందిరములో తుది శ్వాస విడిచారు. ఆ మిత్రుని ఆత్మకు శాంతిగలగాలని భగవంతుని ప్రార్థించుచున్నాను. డా॥ముద్దన హనుమంతరావు మెమోరియల్ ఫండ్ పేరుతో హనుమంతరావుగారి ఆత్మీయులు కొంతనిధిని సేకరించి వారి ఆశయములకు అనుగుణంగా సామాజిక కార్యక్రమాలకు చేయూత నివ్వటం ముదావహము.

# కమ్మవారి చరిత్ర

బౌద్ధమతం వ్యాప్తిలో గల కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో నివసించిన ఒక శాఖ తేర్వాడ - ను పాలీ భాషలో కమ్మఅని, సంస్కృతంలో కర్మ అని అంటారు. ఈ ప్రాంతాన్ని ఒకప్పుడు కమ్మరాష్ట్రం / కమ్మనాడుగా పిలిచేవారు. ఇది పల్లవులు, తూర్పు చాళుక్యులు, చోళుల పాలనలో ఉన్నది. క్రీ.శ.3వ శతాబ్ది నుంచి ఉన్నట్లు, కొందరు చరిత్రకారులను బట్టి నాటి శాసనాల ద్వారా తెలుస్తుంది.

కమ్మపదం కాంభోజ నుంచి వచ్చిందని, వీరు ప్రాచీన ఆర్యులు, యుద్ధవీరుల వంశమని చెపుతారు. వీరు దక్షిణ భారతదేశంలో ఉండేవారు.

మరొక సిద్ధాంతం ప్రకారం బుద్ధులలో కుర్మిశాఖ వారు గంగానదీ ప్రాంతం నుంచి ఎక్కువ సంఖ్యలో అక్కడ పుష్యమిత్ర సంగ (క్రీ.శ.184) పెట్టే వేధింపులను తట్టుకోలేక వలస వచ్చారంటారు. అప్పటికే ఇక్కడ ధరణికోట, భట్టిప్రోలు, చందవోలులలో బౌద్ధం బాగా ప్రబలి వుంది. కాలక్రమేణా సంస్కృత శబ్దం కుర్మి కమ్మగా మారిందంటారు. కమ్మరాష్ట్రం అను పదం తొలిసారిగా ఇక్ష్వాకు రాజు మాధవీపుత్ర పురుషదత్తు (క్రీ.శ. 3 శతాబ్ది) పాలించిన జగ్గయ్యపేట శాసనంలో లభించింది. కమ్మ రాష్ట్రం కృష్ణా నదీ తీరం నుండి కందుకూరు (ప్రకాశం జిల్లా) వరకు విస్తరించి ఉంది. తరువాతి చారిత్రక ఆధారం పల్లవరాజు రెండవ కుమార విష్ణు, తూర్పు చాళుక్య రాజు మంగి యువరాజు (627-696)ల పాలనా కాలంలో లభించాయి. తరువాతి తెలుగు చోళ/ చోడులు/ కాకతీయుల శాసనాలు ఈ ప్రాంతాన్ని కమ్మనాడుగా పేర్కొన్నాయి. ఈ ప్రాంతమే పల్లవుల ఏలుబడిలో ఉండటం వలన పల్లవనాడు, పల్నాడు, పలనాడుగా పిలవబడింది.

కమ్మనాడులోని రాజులు, సేనాపతులు, సైనికాధికారులు 10వ శతాబ్దం నుండి నాయక, నాయకుడు వంటి బిరుదులను వాడినట్లు పలు శాసనాల ద్వారా తెలుస్తుంది. వారి పూర్వీకుల ఊళ్ల పేర్లనే గోత్రనామాలుగా స్వీకరించారు. దీనిని బట్టి కమ్మ, వెలమలు పూర్వీకుల గోత్ర పద్ధతిని అనుసరించని బుద్ధులు గాని జైనులు కాని అయివుంటారు. పెక్కు కమ్మనాయకుల శాసనాలలో తాము - దుర్జయ - వంశస్థులమని చెప్పుకున్నారు. ఉదాహరణకు క్రీ.శ.1125లో మాదల గ్రామంలోని సాగరేశ్వర దేవాలయంలో గల పిన్నమనాయుడు వేసిన శాసనంలో తాను దుర్జయ వంశానికి, వల్లుట్ల గోత్రానికి చెందినవాడినని చెప్పుకున్నాడు. క్రీ.శ.1282లోని అదే దేవాలయంలో గల దేవినేని ఎర్రనాయుడు, కొమ్మినాయుడు, పోతినాయుడు వేసిన మరొక శాసనం ప్రకారం తాము బుద్ధవర్మ సంతతి వారమని, దుర్జయ వంశస్థులమని, వల్లుట్ల గోత్రజులమని తెలిపారు. రావూరు శాసనంలో రాణీ రుద్రమదేవి అంగరక్షకులు ఎక్కినాయుడు, రుద్రనాయుడు, పినరుద్రనాయుడు, పోతినాయుడు కూడా ఇదే గోత్రానికి, వంశానికి చెందిన వారని తెలుపుకున్నారు. కమ్మనాట గల తెలుగు చోడులు తూర్పు చాళుక్యలతో, తరువాత కాకతీయులతో సంబంధాలు కలిగియున్నారు.



కాకతీయరాజు ఒకటవ రుద్రుని పాలన కాలం (1158-1195) నాటికి యుద్ధవీరుల వర్గం చాలా కులాలుగా గుర్తించటం, వారిని పాలకులకు అనుబంధంగా ఆమోదించటం 11వ శతాబ్ది వరకు జరగలేదు. కమ్మనాడులోని వెలనాడులో లభించిన చోళ/ చోడ తెలుగు శాసనాల ఆధారంగా ఒకటవ గొంకరాజు (1075-1115) కాలానికి చెందిన వాటిలో ఇందుకు ఆధారాలు దొరికాయి. ధరణికోట ప్రభువులు (1130-1251) కోట వంశస్థులు తెలుగు చోళులతో వివాహ సంబంధాలు కలిగి యున్నారు. అలాగే కోట వారి రాజులు కాకతీయ వంశపు వారి ఆడపిల్లలను కోడళ్లుగా చేసుకున్నారు. ఉదాహరణకు కోట బేతరాజు గణపతిదేవుని కుమార్తె గణపాంబను పెళ్లాడాడు.

కాకతీయ గణపతిదేవుడు దివిసీమకు చెందిన యుద్ధవీరుడు జాయపసేనాని చెల్లెళ్ళను పెళ్లి చేసుకున్నాడు. జాయపనాయుడు (1231) భారతీయ

*ఒక నిమిషం ఆలస్యం చేసేకంటే మూడు గంటలు ముందుగా ముగించటం మంచిది. - విలియం షేక్ స్పియర్*

నాట్యానికి ఎంతో సేవ చేశాడు. ఆయన కాకతీయ సైన్యపు గజదళానికి నాయకుడు. దాదాపు ఆ కాలంలో చాలామంది కమ్మయోధులు కాకతీయ సైన్యంలో చేరారు.

కాకతీయుల పాలనాకాలంలో (19083 - 1323 ) కమ్మ కులం ప్రాధాన్యతను సంతరించుకున్నది. వారు సైన్యంలో కీలక స్థానాలు సంపాదించారు. దేవగిరికి చెందిన యాదవరాజు దాడిని ఎదుర్కొనటంలో రుద్రమదేవి కాలంలో, ప్రతాపరుద్రదేవుని కాలంలో ప్రముఖంగా పోరాడిన సేనాని దాడి నాగదేవుడు. నాగదేవుని కుమారుడు గన్నా మంత్రి. గన్నా సేనాని / యుగంధర్ కూడా గొప్ప యుద్ధవీరుడు. ఆయన సాహిత్యాన్ని, కళలను పోషించాడు. కవి మారన్న తాను రాసిన మార్కండేయ పురాణాన్ని ఈయనకు అంకితం ఇచ్చాడు. నాగదేవుని ఇతర కుమారులు యల్లయ నాయకుడు, మేచయ నాయకుడు కూడా యుద్ధవీరులే. మరొక ప్రతిష్టాత్మక వీరుడు ముప్పిడి నాయకుడు. ఆయన కంచిపై దాడిచేసి పాండ్యరాజును ఓడించి ఆ రాజ్యాన్ని 1316లో కాకతీయ సామ్రాజ్యంలో విలీనం చేశాడు. 1296-1323 సం॥రాల మధ్య కాలంలో మహమ్మదీయులతో జరిగిన నిరంతర పోరాటాలలో ఓరుగల్లును పరిరక్షించటానికి వేలాది కమ్మ యువకులు కన్నుమూశారు. పరాయి పాలనలో జరుగుతున్న రాక్షస హింస, దౌర్జన్యాలను సహించలేని తెలుగు ప్రజలు తిరుగుబాటుకు సిద్ధం కాసాగారు. ఇద్దరు కమ్మ యోధులు తిరుగుబాటుకు నాయకత్వం వహించారు. వారే ప్రతాపరుద్రుని సేనానులైన ముసునూరి ప్రోలయ నాయకుడు, ముసునూరి కాపయ నాయకుడు. వీరు తిరుగుబాటు జండా ఎగరవేసి, నాయకరాజులను ఏకతాటిపైకి తీసుకువచ్చి, వరంగల్‌కు ఢిల్లీ సుల్తానుల పాలన నుంచి విముక్తి కలిగించారు. అలా ముసునూరి నాయకులు 50 ఏళ్లపాటు పాలించారు.

### విజయనగరరాజుల పాలనా కాలం

కాపయనాయకుని నిర్యాణం తరువాత చాలా మంది కమ్మవారు విజయనగరసామ్రాజ్యానికి వలస వెళ్లారు. శ్రీకృష్ణదేవరాయని కాలంలో ఆయన రాజధాని విజయనగరంలో 37 గోత్రాల కమ్మవారు ఉన్నారు. కమ్మనాయకులు ఆయన సైన్యంలో కీలకభాగమైనారు. వారు తమిళనాడులో పెక్కు ప్రాంతాలలో రాజప్రతినిధులుగా నియమించబడ్డారు. భారతదేశంలో పెద్ద హిందూ రాజ్యాన్ని కాపాడటంలో విశిష్ట పాత్రను పోషించారు.

విజయనగర సామ్రాజ్యపు సేనాపతి, పెమ్మసాని తిమ్మనాయుడు 1422లో గుల్బర్గా రాజ్యంపై పోరాడి దానిని ఓడించారు. అందుకు కృతజ్ఞతగా రెండవ దేవరాయులు ఆ సేనాపతిని గండికోటకు (కడప) పాలకునిగా నియమించారు. తిమ్మనాయుడు రాయలసీమ ప్రాంతంలో చాలా దేవాలయాలను నిర్మించారు. చెరువులను తవ్వించారు. గండికోట కమ్మవారు ముస్లింల దండయాత్రలను ఎదుర్కొని చాలాకాలం తెలుగు నేలను కాపాడారు. పెమ్మసాని రామలింగనాయుడు శ్రీకృష్ణదేవరాయుని ప్రియతమ, ముఖ్య సేనాని. రాయచూర్ యుద్ధంలో విజయం చేకూర్చాడు. అయినా వేలాదిమంది కమ్మ సైనికులు అసువులు బాసారు. రామలింగనాయని ధైర్యసాహసాలను కవులు కథలరూపంలో రాశారు, గాయకులు గానం చేసేవారు. పోర్చుగీసు చారిత్రక కారులు ఈయన వీరోచిత గాథలను ఉటంకించారు.

విజయనగర సామ్రాజ్యంలో తమ వీరత్వాన్ని ప్రకటించిన మరొకరు రావెళ్ల నాయకులు. ఈ తెగకు చెందిన అనేకమంది నాయకులు తమ ప్రాణాలను పణంగా పెట్టి తెలుగు దేశాన్ని కాపాడారు.

విజయనగర సామ్రాజ్యంలో తమిళనాడులోని దక్షిణ, ఉత్తర ప్రాంతాలలో చిన్న రాజ్యాలుగా, నాయకర్/ నైకర్/నాయుడు పేర్లతో, కమ్మవారు చాలా ప్రాంతాలను చాలా కాలం పాలించారు.



### గోల్కొండ కాలం:

1565లో తళ్లికోట యుద్ధం తరువాత విజయనగర సామ్రాజ్యం చాలా క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొన్నది.

పెమ్మసాని, రావెళ్ల, సాయపనేని నాయకులు వీరోచితంగా పోరాడి మహమ్మదీయులను రాకుండా చేయటానికి ఆరవీటి రాజులకు అండగా నిలబడి సహాయం చేశారు. తెలుగు గడ్డమీద మహమ్మదీయులు తమ పాలనను స్థిరపరచుకోవటానికి మరో 90 సం॥రాలు పట్టింది. 1652లో గండికోట పతనంతో కమ్మనాయకులు పెద్దసంఖ్యలో తమిళనాడుకు వలస వెళ్లారు. గోల్కొండ పాలనలో సాయపనేని నాయకులు (1626-1802) దూపాడు ప్రాంతాన్ని సామంతులుగా పాలించారు. గంగప్ప నాయుడు, వెంకటాద్రి నాయుడు, రంగప్ప నాయుడు వీరిలో ముఖ్యమైన వారు. 1579లో ఇబ్రహీం కుతుబ్ షా కొండవీడు రాజ్యాన్ని జయించాడు. షాగారి మరాఠా సేనాపతి రాయారావు 497 గ్రామాలలో దేశముఖ్‌లను, చౌదరీలను నియమించారు. చౌదరీలలో ప్రముఖులు దాసరి, నల్లమోతు, కొసరాజు, పరుచూరి, రావెళ్ల, వాసిరెడ్డి వారు. ఈ కాలంలో కోస్తా జిల్లాలలో కమ్మవారు చౌదరి అను బిరుదును చివర చేర్చుకోవటం మొదలయింది.

నందిగామ పరగణాను 1550-1581 వరకు వాసిరెడ్డి సదాశివనాయుడు పాలించాడు. అతనికి ఇబ్రహీం కుతుబ్‌షా ఈ పరగణాను ఇచ్చాడు. చినపద్మనాభ నాయుడు అబుల్ హసన్ తానీషా నుండి 500 గ్రామాలను 1685లో పొందాడు. ఆయన చింతపల్లిలో కోటను నిర్మించుకొని 1710 వరకు పాలించాడు. ఆయన వారసులు 1760 వరకు పాలించారు. ఆ కాలంలో ఫ్రెంచి, బ్రిటీష్ వారు ఆంధ్రదేశంపై పట్టు సాధించటానికి ప్రయత్నాలు తీవ్రంగా చేస్తున్నారు. చింతపల్లిని 1763 నుంచి జగ్గయ్య పాలిస్తున్నాడు. 1771లో గొల్కొండ నవాబ్ సోదరుడు ఆయన ఒసాలత్‌జంగ్ పంపిన ఫ్రెంచ్ సైన్యం చేతిలో ప్రాణాలు పోగొట్టుకున్నాడు.

జగ్గయ్య సతి అచ్చమాంబ సహగమనం చేసింది. జగ్గయ్య కుమారుడు వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు చింతపల్లిని 1777లో వశపరచుకున్నాడు. దాతగా, ఆదర్శ పరిపాలకునిగా పేరు ప్రతిష్టలు గడించారు. గోల్కొండ నవాబుల ద్వారా బ్రిటిష్ వారు 1788 నాటికి ఆంధ్రదేశాన్ని వశపరచుకున్నారు. ఆ కాలంలోపేరుపొందిన మరొక కమ్మ పాలనా ప్రాంతం.



మన్నె సుల్తాన్ బహద్దర్
శ్రీ రాజావాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు



రాజా వేంకటాద్రి నాయుడు నిర్మించిన
875 అడుగుల ఎత్తుగల మంగళగిరి గాలిగోపురం



బ్రిటీష్

18వ శతాబ్దం ఆఖరుకు బ్రిటీష్‌వారి ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనను ఆంధ్రదేశంలో స్థిరపరచుకున్నది. దేశ్‌ముఖ్‌లు, జమీదారుల సైన్యాధికారాలు రద్దు చేయబడ్డాయి. కేవలం శిస్తు వసూలు హక్కు మాత్రమే మిగిలించబడింది. ఇలా మిగిలిన కమ్మ జమీందారులు ముక్త్యాల, చింతపల్లి (అమరావతి) చల్లపల్లి, దేవరకోట, కపిలేశ్వరపురం, మున్నగునవి. ఈ పరిపాలకులు ఆధునిక విద్యావసతులను ప్రోత్సహించారు. పలు పాఠశాలలు, గ్రంథాలయాలను నెలకొల్పారు.

**ఆధునిక చరిత్ర**

రాజ్యాలన్నీ కనుమరుగైపోయాక సైనిక వారసత్వ సంపదగా తమకు లభించిన భూమాతను నమ్ముకొని, చెమటోడ్చి, కష్టించి ఆంధ్రప్రదేశ్, తమిళనాడులలో వ్యవసాయం కొనసాగించారు. కలుపు మొక్కలతో, బీడు భూములతో సాగు చేశారు. రాళ్లలో రత్నాలు పండించారు. బ్రిటీషు వారు కమ్మవారి ప్రతిభా పాటవాలను గ్రహించి వీరిని గ్రామాధికారులుగా, చౌదరీలుగా పన్నుల వసూలుకు నియమించారు.



గోదావరి, కృష్ణా నదీ జలాలకు ఆనకట్టలు కట్టించి, నీటి పారుదలకు కాలువలు తవ్వించి సర్.ఆర్థర్ కాటన్ మహాశయుడు బంజరు భూములను మాగాణులుగా మార్చటానికి అవకాశం చూపాడు. ఆ అవకాశాన్ని కమ్మవారు సద్వినియోగం చేసుకున్నారు. వారికి గల శ్రమజీవన శైలికి నీటి లభ్యత వరంగా మారింది. ధాన్యపు రాశులు, పురులు పెరిగాయి. వారి జేబులకు డబ్బు రావటం మొదలయింది. వారు తమ కొత్తగా అందిన సంపదను సద్వినియోగం చేసుకున్నారు. పాఠశాలలు, గ్రంథాలయాలకు, అక్షరాస్యతకు వెచ్చించారు. తమ పిల్లలకు ఆధునిక ఆంగ్ల విద్యాబోధనను కష్టనష్టాలకోర్చి కొనసాగించారు. బ్రాహ్మణేతర కులాలలో పిల్లల చదువుకు అంత ప్రాముఖ్యత ఇచ్చినవారు కమ్మవారే. ఒక్క గుంటూరు జిల్లాలోనే 10 ఏళ్ళలో 130 ఉన్నత పాఠశాలలు, వాటికి అనుబంధంగా కొన్ని వసతి గృహాలు కొత్తగా స్థాపించబడ్డాయి. చల్లపల్లి, కపిలేశ్వరపురం జమీందారులు చాలా పాఠశాలలను, గ్రంథాలయాలను నెలకొల్పారు. కాలక్రమంలో సంపాదన పెరగటం, వాణిజ్య, వ్యాపారాలలో, వ్యవసాయ సంబంధ, ఇతర పరిశ్రమలలో ప్రవేశించటం, శాస్త్ర సాంకేతిక రంగాలలో వస్తున్న మార్పులకు అనుగుణంగా తాము మారుతూ దేశంలో ఎక్కడ భూమి సాగుకు ఉందంటే అక్కడికి వెళ్లి దుక్కిదున్నే వాడిగా కమ్మరైతు నిజామాబాద్, రాయచూర్, బళ్లారి, రాయపూర్ (చత్తీస్‌ఘడ్) సంబల్‌పూర్(ఒడిషా) కర్ణాటక, తమిళనాడు, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, వంటి సుదూర ప్రాంతాలకు వెళ్ళి వ్యవసాయపతాకాన్ని ఎగర వేస్తున్నాడు. పాడు బడిన భూములు కొని వ్యవసాయం చేసి చూపుతున్నారు. సినిమాలు, విద్యారంగం, కొత్త పరిశ్రమలలో ముందుకు పోతున్నారు.

విజయనగర సామ్రాజ్యానికి వలస వచ్చిన కమ్మవీరుల వారసులు కూడా నల్లరేగడి నేలల సారమెరిగి సాగు కొనసాగించారు. తరువాత పలు ప్రాంతాలలో, ముఖ్యంగా కోయంబత్తూరులో, పరిశ్రమలపైకి దృష్టి మరల్చారు. గత 50 సంవత్సరాలలో కమ్మవారి చొరవ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు పైన, మొత్తం మీద దేశం అంతటా, సామాజిక ఆర్థిక, రాజకీయ జీవితాలపై ప్రభావం చూపుతుంది. ఆ ప్రభావం ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా కనిపిస్తుంది.

కమ్మవారి విద్యాగంధం విస్తరించింది. విజ్ఞానం పరిధిని అధిగమించింది. సాంకేతిక నిపుణులుగా నిగ్గు తేలారు. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వగైరా దేశాలలో ఉద్యోగాలు పొందుతున్నారు. మేథో వలస కొనసాగుతుంది. కమ్మవారు విశ్వ పౌరులవుతున్నారు.

**విస్తరణ:** ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ మొత్తంలో కమ్మవారిలో అధికులు ఖమ్మం, ప్రకాశం, గుంటూరు, కృష్ణా,పశ్చిమ గోదావరి జిల్లాలలో ఎక్కువగా, చిత్తూరు, హైదరాబాదు, రంగారెడ్డి, అనంతపురం, తూర్పుగోదావరి, నిజామాబాద్, కడప, కర్నూలు, నెల్లూరు, విశాఖపట్టణం జిల్లాలో కొంతవరకు విస్తరించి ఉన్నారు. కర్ణాటకలో బళ్లారి, బెంగళూరు జిల్లాలలో, తమిళనాడులో చెన్నై, కోయంబత్తూరు, తిరునెల్వేలి, టుటికోరిన్, కోవిల్ పట్టి,మధురై,విరుద్ నగర్, తెని, కరూర్, దిండిగల్, ఉత్తర ఆర్కాట్, దక్షిణ ఆర్కాట్ జిల్లాలలో ఉన్నారు.

**రాజకీయాలు:** కమ్మవారు రాజకీయాలలోక్రియాశీలక పాత్రను, ముఖ్యంగా కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో, తమిళనాడు, కర్ణాటకలలో కొన్ని ప్రాంతాలలో పోషిస్తున్నారు. 20వ శతాబ్దంలో యన్.జి.రంగా వంటి ప్రగతిశీల నాయకులు, కొత్త రఘురామయ్య, గొట్టిపాటి బ్రహ్మయ్య, మోటూరు హనుమంతరావు, కల్లూరి చంద్రమౌళి వంటి వారు స్వాతంత్ర పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించి త్యాగాలు చేశారు. పలువురు కమ్మవారు వామపక్ష భావజాలం చేత ప్రభావితులై కమ్యూనిస్టు పార్టీలో చేరారు. 1960లలో వారొక బలమైన శక్తిగా ఎదిగారు. చాలమంది ఐశ్వర్య వంతులైన కమ్మవారు తమ భూములను ఇష్టపూర్వకంగా దానం చేసి పేదలకు భూపంపిణీ చేయటానికి నడుము బిగించారు. ఇందువల్ల పలువురు భూమిలేని నిరుపేదలు మధ్యరకం రైతులుగా మారగలిగారు. అంతేకాక ఏ ఒక్క కులానికో కాకుండా అందరి ఆర్థిక ప్రగతికి దారి తీశారు. ఆనాటి పెద్దల త్యాగాలతో నాటిన బీజాలు ఈనాడు ఫలితాలను ఇస్తున్నాయి.

# కమ్మ మహాజన సేవా సంఘం

## యన్.జీ.వో కాలనీ, నరసరావుపేట

**ఫోను : 08647-220456**

ఈ సంస్థ 1971లో ఏర్పడినది. 2005 సం॥రంలో 333మంది శాశ్వత సభ్యులతో రిజిష్టర్ చేశారు. మారుతున్న పరిస్థితులలో వివిధ కోర్సులలో విద్యాభ్యాసం చేస్తున్న బాలికల సంఖ్య పెరుగుతున్నది. నరసరావుపేటలో గ్రామీణ ప్రాంతాలవారు వసతిలేక ఇబ్బందులకు గురి అగుచున్నారు. అటువంటి బాలికలకు వసతి గృహాన్ని నిర్మించారు. ప్రస్తుతం 569 మంది శాశ్వత సభ్యులు ఉన్నారు. 52సెంట్ల విస్తీర్ణంలో 8వేల అడుగుల నేల అంతస్తు, 4వేల అడుగుల 2వ అంతస్తు నిర్మించారు. మొదటి సం॥ 55మంది, 2వ సం॥ 99మంది, 3వ సం॥ 150 మంది, 4వ సం॥ 180మంది, 5వ సం॥ 203మంది, 6వ సం॥ 227మంది, 7వ సం॥ 251మంది విద్యార్థులకు వసతి కల్పించబడినది. పేద విద్యార్థినులకు దాతలు విరాళాలు అందిస్తున్నారు.

నాగోతు శౌరయ్యగారు అధ్యక్షులుగా, డా॥ ఓగూరి కోటయ్యగారు ఉపాధ్యక్షులుగా, గరికపాటి వెంకటేశ్వరరావు కార్యదర్శిగా, వాసిరెడ్డి రవీంద్ర బాబుగారు సంయుక్త కార్యదర్శిగా, బొలినేని రామకృష్ణగారు కోశాధికారిగా పాలకవర్గం పనిచేస్తున్నది. దాతలు నిరంతర ప్రోత్సాహం వల్ల సంస్థ ముందుకు సాగుతున్నది.


ఆచార్య ఎన్.జి.రంగాగారు


కల్లూరి చంద్రమౌళిగారు


కొత్త రఘురామయ్యగారు

ఆలోచనగానే మిగిలిపోయిన ఆలోచన కంటే ఆచరణలో పెట్టినది మేలైనది.

**భారత ప్రభుత్వం ఆయా రంగాలలో విశిష్ట కృషి చేసిన మహనీయులను గుర్తిస్తూ వారిపై తపాలా బిళ్ళలను విడుదల చేస్తుంటారు. అటువంటి గౌరవాన్ని పొందిన ప్రముఖులు**




త్రిపురనేని రామస్వామి చౌదరి




ఎన్.టి. రామారావు




ఆచార్య రంగా




త్రిపురనేని గోపీచంద్




ఎల్.వి. ప్రసాద్

## కోటప్పకొండ కాకతీయ సేవాసమితి



ఆంధ్రదేశమున అపారమైన మహిమతో జ్ఞాననిధి అయిన పరమశివుడు కోటప్పకొండపై దక్షిణామూర్తిగా వెలసియున్నాడు. ఈ స్వామి భక్తుల మానసిక బాధలను తొలగించు మహిమ కలవాడు. శ్రావణ, కార్తీక మాసములలో ఈ స్వామిని పూజించిన జ్ఞానసంపద కలుగుట నిశ్చయము. అంతటి మహిమగల పుణ్యక్షేత్రం కనుకనే రోజురోజుకు కోటప్పకొండపై యాత్రికుల రద్దీ ఎక్కువగు చున్నది. అందుకే డా॥ కోడెల శివప్రసాదరావు గారు "కోటప్పకొండ" పుణ్యక్షేత్రాన్ని సకల సదుపాయాలతో పర్యాటక కేంద్రంగా, ప్రభుత్వ, ప్రభుత్వేతరుల సహాయ సహకారాలతో అలనాటి ముఖ్యమంత్రి 'తెలుగువల్లభుడు' నందమూరి తారకరామారావుగారు, గత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గార్ల సహకారంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినారు.

సుదూర ప్రాంతాలనుండి త్రినేత్రుని సన్నిధికి చేరే లక్షలాది యాత్రికులకు ఉచిత అన్న ప్రసాదం అందించాలని, పర్వదినాలలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు చేయాలనే లక్ష్యంతో 2002 సం॥న "కోటప్పకొండ కాకతీయ సేవాసమితి"ని ఏర్పాటు చేశారు. ఘాట్‌రోడ్ ప్రవేశ ద్వారానికి అతిచేరువలో 5 ఎకరముల పొలము కొనుగోలు చేసి అందులో 10వేల చ॥ అడుగుల వైశాల్యంలో కళ్యాణమండపం, భోజనశాల, వంటశాలలను కట్టించారు. మహాశివరాత్రి పర్వదినమే గాక ప్రతి సంవత్సరము కార్తీకమాసం, తొలి ఏకాదశి పండుగల సందర్భంగా ఈ పుణ్యక్షేత్రాన్ని దర్శించే భక్తులకు సేవ చేయుచున్నారు. ఈ సంస్థకు తోడుగా వివిధ కార్యక్రమములందు భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ వంటి వివిధ సంస్థలు అండగా నిలుస్తున్నాయి.

*ఎక్కువగా సాగదీస్తే విల్లంబు, సాగదీయకపోతే మనసు పాడైపోతాయి. - బేకన్*



## మాదల కుటుంబీకుల భూదానం

వ్యాపార దిగ్గజాలు వారన్ బఫే, బిల్‌గేట్స్, నారాయణమూర్తి (ఇన్ఫోసిస్) వంటి వారు తమ సముపార్జనలో గణనీయమైన వాటాను సమాజానికి తిరిగి చెల్లించాలనే నిర్ణయంతో ముందుకు వెళుతున్నారు. ప్రతి మతం సంపాదనలో కొంత భాగం సమాజహితానికి వెచ్చించాలని నిర్దేశిస్తుంది. హిందూమతానికి కూడా దానధర్మాలు కొత్త కావు. బాటసారులకే కాక పశుపక్షులకు కూడా అవసరమైన చెరువులు, బావులు తవ్వించటం, వనాలు పోషించటం, సత్రాలు, దేవాలయాలు, ధర్మశాలలు కట్టించటం వంటి జీవకోటి శ్రేయస్సుకు ప్రయోజనకమైన కార్యకలాపాలు చేపట్టటం హిందువుల రక్తంలో ఒక భాగం, ఆలోచనల్లో అంతర్భాగం. ఇతరులకు మేలు చేయటానికి మించిన పుణ్యం లేదని మనం నమ్ముతాం.

అదే ఆలోచనలో మార్గంగా బహుజనహితం కోరి వివిధ రంగాలకు తమ చేయూతనిచ్చి, మంచి కార్యాలను ప్రోత్సహిస్తున్న సంస్థ జనచైతన్య హౌసింగ్, గుంటూరు కేంద్రంగా, పలు శాఖలతో పరిఢవిల్లుతున్న ఈ సంస్థ అధినేతలు మాదల సోదరులు రత్నగిరిబాబు, సుధాకర్‌లు వారికి మార్గదర్శి, మాతృమూర్తి శ్రీమతి శకుంతలమ్మ గారు. వీరి దానధర్మాలు బహిరంగంగా తెలిసిన వాటికంటే అజ్ఞాతంగా చేసేవి అనేక రెట్లు ఎక్కువ ఉంటాయి. తెలిసిన వాటిలో మచ్చుకు కొన్నిటిని చూద్దాం.

ఆధ్యాత్మికం : కంచి కామకోటి పీఠ ఆచార్యుల ప్రియభక్తులుగా ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రచురించి ఉచితంగా పంచుతున్నారు. గుంటూరు సమీపంలోని జనచైతన్య నగర్‌లో సాయి మందిరాన్ని నిర్మించి గత కొన్ని సంవత్సరాలుగా నిరంతర, అఖండ నామపారాయణ చేస్తున్నారు.

వైద్యం : దానాలలో భూదానం విశిష్టమైనదని విశ్వసించి, జాతీయ రహదారి, గుంటూరు - విజయవాడ మార్గం ప్రక్కన 5 ఎకరాల భూమిని కంచి స్వామి వారికి సమర్పించారు. ఆ స్థలంలో స్వామి వారు అత్యాధునిక శంకర కంటి ఆసుపత్రిని నెలకొల్పారు. స్వామి వారి కరుణాకటాక్షాలు, చల్లని చేతులతో చేసిన భూదానం వంటి ప్రధాన కారణాల వల్ల ఈ ఆసుపత్రిలో ప్రతి ఏటా ఇరుగు పొరుగున గల నాలుగైదు జిల్లా వాసులు కొన్ని వేలమందికి ఉచిత శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి, ప్రపంచ స్థాయి వైద్య సేవలు పేదలకు, సామాన్యులకు అందుతున్నాయి.



## జన చైతన్య హౌసింగ్ ప్రై. లి.

విద్య : రాష్ట్రంలో విద్యారంగంలో బహుముఖ శాఖలతో విస్తరించబడుతూ, ఉన్నత ప్రమాణాలకు మారుపేరుగా సంస్థలను నిర్వహిస్తున్న నాగార్జున ఎడ్యుకేషనల్ అకాడమి ఈ దశాబ్దంలో నర్సింగ్ కళాశాలను కూడా ప్రారంభించి నిర్వహిస్తుండగా, ఆ సంస్థకు అన్ని హంగులు కల భవన సముదాయ ఆవశ్యకతను గుర్తించిన జనచైతన్య 'మాదల శకుంతలమ్మ నర్సింగ్ కళాశాల'కు గుంటూరు పరిసరాల్లో ఒక ఎకరం భూమిని దానం చేశారు. నర్సింగ్ డిగ్రీ, పి.జి. కోర్సులకు, ప్రాక్టికల్స్ కోసం ఇతర ఆసుపత్రులపై ఆధారపడకుండా, స్వంతంగా అనుబంధ ఆసుపత్రి నిర్మాణానికి తుది మెరుగులు దిద్దుకుంటున్నది.

బాలికల వసతి గృహం : గ్రామీణ బాలికలకు విద్య అందని మానిపండులా ఉన్న సందర్భంలో కమ్మజనసేవాసమితి చేస్తున్న విశేష కృషిని గుర్తించి, ఆ సేవలను మరింతగా విస్తరించటానికి వీలుగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఒక ఎకరం భూమిని దానం చేశారు.

ఇవాళ వారు దానం చేసిన స్థలం విలువ చదరపు అంగుళం 20 రూ.లు అని అంచనా వేయవచ్చు. కాని జనచైతన్య దానం వల్ల కలిగే ప్రయోజనాలను డబ్బుతో విలువకట్టలేము. వారు దానం చేసిన భూముల వల్ల వందల మంది గ్రామీణ బాలికలు లబ్దిదారులవుతారు. నిస్వార్థ హృదయంతో జనచైతన్య అధినేతలు శ్రీమతి శకుంతలమ్మ, వారి కుమారులు సుధాకర్, రత్నగిరి బాబు గారలు చేసిన ఉదారదానాలు వారి తరువాతి తరాల వారు కూడా గర్వించదగినవి. వారికి హృదయపూర్వక ధన్యవాదములు తెలుపుకుంటూ, మాదల కుటుంబానికి సర్వశుభాలు కలగాలని కమ్మజన సేవాసమితి భగవంతుని ప్రార్థిస్తుంది.


మాదల శకుంతలమ్మ


మాదల రత్నగిరిబాబు


మాదల సుధాకర్

మంచినీరు, ఆహారం, ఆవులు, వస్త్రాలు, బంగారం వంటి అన్ని దానాల కంటే విద్యావ్యాప్తికి చేసిన సహాయం ఉత్తమోత్తమమైనది -మనువు

# నందమూరి తారక రామారావు - జీవన రేఖలు

ఏ పేరు వింటే పుడమి తల్లి పులకిస్తుందో, ఏ పేరు వింటే తెలుగుజాతి సమున్నతంగా తలెత్తుకుని తిరుగుతుందో ఏ పేరు చెబితే తెలుగువాడి పౌరుష కాంతులు దశ దిశలా వ్యాపిస్తాయో, ఏ పేరు తలచుకుంటే తెలుగింటి ఆడపడుచులు అన్నా అని కలవరిస్తారో, ఆయనే నందమూరి తారక రామారావు.



తెలుగువాడి పూర్వ వైభవ ప్రాభవాలను, తెలుగు జాతి కీర్తి ప్రతిష్ఠలను, ప్రపంచ వ్యాప్తంగా పంచి వెలుగులు నింపిన కారణజన్ముడు, అవతారపురుషుడు నందమూరి తారక రాముడు.

ఆయన కృష్ణా జిల్లాలోని నిమ్మకూరు గ్రామంలో 28 మే, ........ న జన్మించారు. నిమ్మకూరులో 5వ తరగతి వరకు చదువుతూ భారత, రామాయణాలను పరిచయం చేసుకున్నాడు. సాహిత్య, సాంస్కృతిక సౌరభాలు శైశవంలోనే గుబాళించాయి. పౌరాణిక సాహిత్యం పట్ల అనురక్తి బీజాలు ఆనాడే నాటుకున్నాయి. ఆకర్షణీయమైన కంఠస్వరంతో బాలరామాయణం వల్లెవేస్తుంటే గ్రామస్తులు నివ్వెరపోయేవారు. ముత్యాల వంటి దస్తూరి, చిత్రకళా ప్రవేశం కూడా పొందారు. చదువుకుంటూనే పొలం పనులకు కూడా వెళ్ళేవారు. ఊరిలో జాతరలలో నాటకాలు వేసి ఆకర్షించేవాడు ఈ స్ఫురద్రూపి. తరువాత విజయవాడ మున్సిపల్ హైస్కూల్‌లో చేరారు. ఇంటర్‌లో కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రామారావుకు గురువు. ఆయన రచించిన నాటకంలో కథానాయిక నాగమ్మ వేషం వేసి బహుమతి పొందాడు. అనార్కలిలో సలీంగా నటించి ప్రథమ బహుమతి పొందాడు. ఆ ఉత్సాహంతో నేషనల్ ఆర్ట్ థియేటర్, యంగ్ ఆంధ్రా అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో నాటక ప్రదర్శనలు యిచ్చి ఔత్సాహిక కళాకారుడిగా రూపొందాడు. 1942లో శ్రీమతి బసవతారకంతో వివాహం అయింది. నాటకాల ఆసక్తితో ఇంటర్ ఫెయిలయినా ఖాళీగా వుండక చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ కష్టపడి చదివి ఇంటర్ పాసయ్యారు. గుంటూరు ఏ.సి. కాలేజిలో బి.ఏ.లో చేరారు. అక్కడ కూడా ఆయన నట జీవితం కొనసాగింది. పరిషత్ పోటీలలో పాల్గొన్నాడు. కాలేజీ నాటకంలో వేసిన నలగామరాజు పాత్ర ద్వారా ప్రముఖ దర్శకులు సి. పుల్లయ్య దృష్టికి వచ్చి సినిమాలలో చేరటానికి ఆహ్వానం అందుకున్నాడు. కానీ చదువు ఆపటం ఇష్టంలేని రామారావు బి.ఏ. పూర్తి చేశారు.



సబ్ రిజిస్ట్రార్ ఉద్యోగిగా గుంటూరులో ప్రవేశించారు. బి.ఏ. సుబ్బారావు తాను తీస్తున్న పల్లెటూరి పిల్ల సినిమాలో కథానాయకునిగా రామారావును ఆహ్వానించారు. ఉద్యోగాన్ని వదలి మద్రాసు వెళ్ళారు.

ఎన్.టి.ఆర్. సినిమా చరిత్ర ఒక శకం వంటిది. అది నాలుగున్నర దశాబ్దాలు కొనసాగింది. 1949లో మనదేశంతో ప్రారంభమైంది. మధ్యలో కొంత కాలం రాజకీయ విరామం. మరల 1993లో తన 70వ యేట మేజర్ చంద్రకాంత్‌తో ముగిసింది. ఇందులో కేవలం సినీ జీవితం 33 సంవత్సరాలు. ఆయన ధరించిన ప్రతి పాత్రను మరొకరు చేయలేరన్నంతగా ఉత్తమ స్థాయిలో నటన, భాష, హావ భావాలను కలిపి ప్రేక్షకులను అలరించిన నటరత్న ఆయన.

1982 మార్చి 29న కొత్త పార్టీ ఏర్పాటుకు సారధ్య సంఘం ఏర్పడింది. నాటి బహిరంగ సభలో నందమూరి ఉద్విగ్నంగా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని స్థాపించుతున్నట్లు ప్రకటించారు. తెలుగు ప్రజలు హర్షధ్వానాలతో ఆమోదించారు. నాటి నుంచి తెలుగుజాతి ఆత్మగౌరవ నినాదం అంబరాన్ని తాకింది. ఒక కొత్త రూపంతో, కొత్త నినాదంతో, కొత్త ఒరవడితో తారకరాముడు మహోత్తుంగతరంగమై లేచారు.

*జలపాతాలు తమ దారిని తామే నిర్ణయించుకుంటాయి. అలాగే దృఢ సంకల్పం గల వ్యక్తులు గూడా.*



ఆయన ఆశయాలకు జనం జేజేలతో వంత పాడారు. వర్ణ వర్గ వివక్షలకు అతీతమైన మహోద్యమమది. నిజాం కాలేజి గ్రౌండ్స్‌లో లక్షలాది జనంతో చారిత్రాత్మకమైన తొలి తెలుగు మహాసభ విజయవంతమైంది. నాటి ఊరేగింపు హైదరాబాద్ వీధులను దద్దరిల్లజేసింది. తెలుగుజాతికి ఒక గుర్తింపు, గౌరవం తేవటానికి కుళ్ళిపోయిన పాతవ్యవస్థను కూకటివేళ్ళతో పెకలించి నూతన వ్యవస్థను నిర్మించటానికి ఆయన కంకణం కట్టుకున్నారు. జనసముద్రాన్ని చూసి ఆయన ఉత్సాహం ఉరకలు వేసింది. తిరుపతి సభావేదిక నుండి సమరశంఖం పూరించారు. పార్టీ ప్రచార చైత్రయాత్రను ప్రారంభించారు. ఆయనను చూడటానికి ఆబాలగోపాలం గంటలతరబడి ఎదురుచూశారు. త్రికరణశుద్ధిగా ఆయన చేసిన ఉపన్యాసాలు ప్రజానీకపు గుండెలోతులను తాకాయి. కొండలు, కోనలు, వాగులు, వంకలు అన్నింటినీ దాటుతూ 9 నెలలు చారిత్రాత్మక పర్యటన ప్రచార రథంపై చేశారు. 1983 జనవరి 5న తెలుగుదేశం పతాకం నిరాటంకంగా ఎగిరింది. ప్రతి ఓటరు తాను నందమూరికే ఓటు వేస్తున్నాననుకున్నారు. కేవలం 9 నెలల వ్యవధిలో ఒక పార్టీని స్థాపించి గెలిపించటం ప్రపంచ రికార్డు. అశేష ప్రజల సమక్షంలో ముందెన్నడూ లేనివిధంగా, నూతన ఒరవడితో 15 మంది మంత్రులతో బహిరంగంగా లాల్‌బహదూర్ స్టేడియంలో ప్రమాణం చేశాడు.



కిలో 2 రూపాయల బియ్యం పథకం, బడి పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం, మనిషికి ప్రాథమిక అవసరాలను అందించటానికి అనేక పరిపాలనా సంస్కరణలను తీసుకువచ్చారు. భూమిశిస్తు రద్దు, పటేల్, పట్వారీ వ్యవస్థ రద్దు, మాండలిక వ్యవస్థ ఏర్పాటు, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు వంటి అనేక చారిత్రాత్మక, విప్లవాత్మక పథకాలు ప్రవేశపెట్టారు. జాతీయ స్థాయిలో కాంగ్రెసేతర ప్రభుత్వాలను ఒకతాటిపైకి తీసుకువచ్చి నేషనల్ ఫ్రంట్‌ను ఏర్పాటుచేసి దానికి కన్వీనర్‌గా కొనసాగారు. 1984లో అప్రజాస్వామికంగా ముఖ్యమంత్రి పదవినుండి తొలగించబడినపుడు ఆ ధీరుడు సాగించిన పోరాటం చారిత్రకమైనది. తిరిగి ముఖ్యమంత్రి అయి వెంటనే ప్రభుత్వాన్ని రద్దు చేసి తర్వాత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి కనీసం ప్రతిపక్ష హోదాకూడా దక్కకుండా చేసి దేశ రాజకీయాలలో తన విశిష్టతను చాటుకున్నారు. ఆయన జీవిత చరిత్ర భావితరాలకు ఆదర్శం.



–మన్నవ సుబ్బారావు, కార్యదర్శి,
రాష్ట్ర తెలుగుదేశం పార్టీ



## చెరుకూరి రామోజీరావు

స్వయంకృషికి మారుపేరు

పత్రికారంగంలో నూతన ఒరవడిని సృష్టించాడు. ఈనాడు దినపత్రిక, విపుల, చతుర, అన్నదాత, తెలుగు వెలుగు, బాలభారతి మాసపత్రికలు, సితార వారపత్రిక, మార్గదర్శి చిట్‌ఫండ్స్, ప్రియ ఫుడ్స్, ప్రపంచ ప్రఖ్యాత రామోజి ఫిల్మ్ స్టూడియో, ఈ–టీవి వంటి పలు సంస్థలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. సినిమా నిర్మాత. పట్టుదలకు మారుపేరు.

*కలాలు చాలా ప్రమాదకరమైన ఆయుధాలు. అవి కత్తులు, కొరడాలు, బెత్తాలకంటే లోతుగా కోస్తాయి. జాన్*



## వేమూరి రాధాకృష్ణ

ప్రధాన సంపాదకులు
ఆంధ్రజ్యోతి దినపత్రిక
వారపత్రిక, నవ్య,
ఏ.బి.యన్. టి.వి. ఛానల్
మేనేజింగ్ డైరెక్టర్

*జీవితంలో రిస్క్ తీసుకోవటం అవసరం. భద్రత, సురక్షితం చూసుకుంటే ప్రగతి రాదు. ఆలెక్స్ నోబుల్*

# నారా చంద్రబాబు నాయుడు రాజకీయ ప్రస్థానం



చిత్తూరు జిల్లా చంద్రగిరికి దగ్గరలో ఖర్జూర నాయుడు, అమ్మణ్ణమ్మ దంపతులకు పెద్దకుమారునిగా నారావారి పల్లెలో పుట్టిన చంద్రబాబు నాయుడు ఉత్తమ నాయకునిగా రూపొందారు.

ప్రతి పనికి ఒక ప్రణాళికాబద్ధమైన ఆలోచన, నిర్దిష్ట కార్యాచరణ, నిరంతర నిఘా, ఫలితం సాధించేవరకు వదలని కృషి ఆయనను వ్యక్తిగత జీవితంలో, రాజకీయ జీవితంలో అగ్రభాగాన నిలబెట్టి సమర్ధుడిగా, శక్తిమంతుడిగా పేరు తెచ్చుకోడానికి దోహదం చేశాయి. కాలినడకన బడికి వెళ్ళి చదివి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగాడు. ఈ క్రమంలో ఎన్నో సంక్షోభాలు, మరెన్నో సంఘర్షణలు ఇలా వచ్చాయి ఆలా పోయాయి.

విద్యార్థి దశలోనే రాజకీయాలతో మమేకమైన శ్రీ నారా ఏనాడు పదవులకోసం వెంపర్లాడలేదు. పదవులే ఆయనను వరించి వచ్చాయి. తన విజయాలను చూసి ఆయన ఎప్పుడూ పొంగిపోలేదు. సంక్షోభం వచ్చినా కుదేలైపోలేదు. చిరునవ్వుతోనే కష్టాలను స్వీకరించి మరింత బలోపేతం అవుతూ ముందుకు సాగారు. ఆయన "అదృష్టాన్ని నేనెప్పుడూ నమ్ముకోలేదు, నా కష్టాన్నే నమ్ముకున్నాను" అంటారు. ఆనాటి రాష్ట్ర రాజకీయ సాగరమధనంలో చంద్రగిరి నుంచి రాష్ట్ర రాజకీయాలలోకి తరలివచ్చిన యువ నాయకుడు నాటి నుండి నేటి వరకు వెనుతిరిగి చూడలేదు.

1978లో మొట్టమొదటి సారిగా శాసనసభలో అడుగుపెట్టిన చంద్రబాబు నాయుడు అప్పటి మంత్రివర్గంలో సినిమాటోగ్రఫి మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలోనే నందమూరి తారక రామారావు గారితో పరిచయం ఏర్పడగా, 1981లో వారి అమ్మాయి భువనేశ్వరితో వివాహం జరిగింది. తెలుగుదేశం పార్టీలో చేరిన తరువాత 1984లో ఎన్.టి.ఆర్. ప్రభుత్వాన్ని కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అప్రజాస్వామికంగా కూల్చివేసినప్పుడు నాయుడు గారి సారథ్యంలో జరిగిన ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం చారిత్రాత్మకం. మరల నందమూరిని ముఖ్యమంత్రి పదవిలో అధిష్టింప చేయడంలో తాను పోషించిన పాత్ర కీలకం. నాయుడు గారి నాయకత్వ లక్షణాలు, దూరదృష్టి ప్రస్ఫుటమయ్యాక తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి పదవి పగ్గాలను చేతబూనారు. పార్టీని ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్ది గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడంలో చంద్రబాబు ప్రధాన భూమికను పోషించారు.

1989 ఎన్నికలలో చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం నుంచి సాటిలేని ఆధిక్యతతో విజయం పొందారు. ఆ సమయంలో తెలుగుదేశం ప్రతిపక్ష స్థానానికి పరిమితం కావలసివచ్చింది. అయినా శాసనసభలో ప్రజా సమస్యలపై గళమెత్తి గర్జించారు. పలు ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేపట్టి జనాన్ని చైతన్యవంతులను చేశారు. 1994లో జరిగిన ఎన్నికలలో తెలుగు బావుటా మళ్ళీ ఎగిరింది. అప్పుడు చంద్రబాబు గారు కీలకమైన రెవిన్యూ మరియు ఆర్థిక శాఖలను నిర్వహించారు. ఆర్థిక విధాన రూపకల్పనలో ఎంతో ముందుచూపుతో వ్యవహరించారని ఆర్థిక నిపుణుల ప్రశంసలు అందుకున్నారు.

కార్యకర్తలను, పార్టీని రక్షించుకోవలసిన పరిస్థితులు 1995లో ఏర్పడ్డాయి. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీనే నమ్ముకున్న పార్టీ శ్రేణుల అభిప్రాయాలను గౌరవించి నాయకత్వ మార్పుతో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యారు.

రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయన ఎన్నో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. తనదైన సొంత బాణీలో రోజుకు 18 గంటలు నిర్విరామంగా కష్టపడ్డాడు. తాను కష్టపడడమే కాక ఇతరులలో

*నాయకుడు సమాజంలో సభ్యుడే. వాటికి సుస్పష్ట లక్ష్యం, పట్టుదల, దహించే తపన కలిగిస్తే అవి పదునైన బాణాలవుతాయి*



కష్టపడే తత్వాన్ని పెంపొందించారు. ఆయన పాలనాతీరు మంచి ఫలితాను అందించింది. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి విప్లవాత్మక మార్పులు తెచ్చారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా పరిపాలనలో కంప్యూటర్ల వాడకాన్ని, ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజిని ముఖ్య సాధనాలుగా చేసుకొని ఈ-పాలనకు నాంది పలికారు. సమాచార, సాంకేతిక రంగాలలో దేశంలోనే ఎక్కువ ప్రయోగాలు చేసిన ముఖ్యమంత్రిగా ప్రపంచ దేశాల ప్రశంసలను అందుకొన్నారు. ప్రజల వద్దకు పాలన, జన్మభూమి, డ్వాక్రా, నీటి సంఘాలు, రైతు బజార్లు, విజన్-2020 లాంటి అనేక పథకాలతో పారదర్శకంగా జవాబుదారీతనంతో పాలన సాగించారు.

ఐ.టి.తో పాటు బయో టెక్నాలజీపై కూడా దృష్టి సారించి రాజకీయ నాయకులలో ఇలాంటి శాస్త్రీయ పరిజ్ఞాన తృష్ణ కల వ్యక్తిగా ఖ్యాతిగాంచారు.

కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలు, రాజకీయ కక్ష సాధింపు చర్యలు, అవినీతి కుంభకోణాలపై ప్రతిపక్ష నేతగా, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా తొలిరోజునుంచి రాజీ లేని పోరాటాలు సాగిస్తున్నారు. పార్టీ శ్రేణులను అన్ని స్థాయిలలో సమాయత్తం చేస్తూ, ప్రజలలో చైతన్యం పెంచుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఆయన చేస్తున్న ఉద్యమాలు, పోరాటాలు రాష్ట్ర రాజకీయ చరిత్రలో మైలురాళ్ళు.

ఆయన రాజకీయ చాతుర్యానికి, క్రమశిక్షణకు ప్రజాస్వామ్య సూత్రాలపై గౌరవానికి ప్రతిరూపంగా భవిష్యత్ దార్శనికునిగా ముందడుగులు వేస్తున్న నారా చంద్రబాబు నాయుడు గారికి శుభాకాంక్షలు.

-మన్నవ సుబ్బారావు, కార్యదర్శి,
రాష్ట్ర తెలుగుదేశం పార్టీ



## రాయపాటి సాంబశివరావు
## 11, 12, 14, 15 లోక్‌సభ సభ్యులు
## గుంటూరు పార్లమెంటు సభ్యులు

జననం : 7 జూన్ 1943, ఉంగుటూరు

తల్లిదండ్రులు : వెంకట రంగారావు, సీతారామమ్మ

పుగాకు వ్యాపార దిగ్గజం, నూలు, సుగంధ ద్రవ్యాల వ్యాపారం.

పుగాకు బోర్డు ఉపాధ్యక్షులుగా, తిరుమల తిరుపతి దేవస్థాన పాలకమండలి సభ్యునిగా, భారత సాంకేతిక విద్యా కౌన్సిల్ సభ్యునిగా పనిచేశారు.

నిగర్వి, నిరాడంబరులయిన వీరు ధార్మిక, ఆధ్యాత్మిక, భక్తి కార్యక్రమాలకు విరివిగా విరాళాలు యిచ్చారు.

రాజకీయరంగంలో ప్రజలకు అందుబాటులో ఉండే నాయకునిగా గుర్తింపు పొందారు.

ఆర్థిక స్టాండింగ్ కమిటీ

అంచనాల కమిటీ

ఎథిక్స్ కమిటీ

హౌస్ కమిటీ

రహదారులు, రవాణా శాఖ సంప్రదింపుల కమిటీలలో సభ్యులు

రైల్వే శాఖ సంప్రదింపుల కమిటీలో శాశ్వత ప్రత్యేక ఆహ్వానితులు

అనుకూల పరిస్థితులు సమకూరే వరకు నాయకుడు ఆగడు. తానే పరిస్థితులను సానుకూలంగా మలచుకుంటాడు.

# డా. కావూరి సాంబశివరావు



ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం ప్రతినిధి (పశ్చిమ గోదావరి జిల్లా)
భారత జాతీయ కాంగ్రెస్
2 అక్టోబరు 1943 న కృష్ణా జిల్లా దోసపాడులో జననం
అర్ధాంగి - శ్రీమతి హేమలత
వరంగల్ ఆర్.ఈ.సి. నుంచి ఇంజనీరింగ్ పట్టభద్రులు
వ్యవసాయదారు, ఇంజనీరు, రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్త
చేపట్టిన పదవులు :

1984 : 8వ లోక్‌సభకు ఎన్నిక
1985 : భారత జాతీయ కాంగ్రెసు కమిటీ జాయింట్ సెక్రటరీ, ఏ.ఐ.సి.సి. సభ్యులు
1985-87 : సబార్డినేట్ లెజిస్లేటివ్ కమిటీ సభ్యులు
1985-89 : ఆర్థిక మంత్రిత్వ శాఖ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు
1987-89 : అంచనాల కమిటీ సభ్యులు
1989 : రెండవ సారి లోక్‌సభ సభ్యునిగా ఎన్నిక
1989-90 : హౌస్ కమిటీ సభ్యులు
1989-94 : ఆం.ప్ర. కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ
1990-91 : ఆర్థిక మంత్రిత్వ శాఖ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు
1998 : ఏ.పి.సి.సి. ఉపాధ్యక్షులు
1998 : మూడవసారి 12వ లోక్‌సభ సభ్యులు
1998-99 : ఆర్థిక మంత్రిత్వ శాఖ కమిటీ సభ్యులు, ఉపరితల రవాణా కమిటీ సభ్యులు
2004 : నాలుగవ సారి 14వ లోక్‌సభకు సభ్యునిగా ఎన్నిక
2004-07 : అంచనాల కమిటీ సభ్యులు
2004-09 : ఆర్థిక మంత్రిత్వ శాఖ సలహా కమిటీ సభ్యులు, పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వశాఖ సలహా మండలి సభ్యులు, విద్యుత్ మంత్రిత్వ శాఖల కమిటీ సభ్యులు
2006-07 : రూల్ కమిటీ సభ్యులు
2007-09 : పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు
2009 : 5వ సారి లోక్‌సభ సభ్యునిగా ఎంపిక, ఎనర్జీ, పబ్లిక్ అకౌంట్స్, ఎనర్జీ మంత్రిత్వ శాఖ సలహా కమిటీలలో సభ్యులు
2010 : ఆం.ప్ర. కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు
2011 : రాజ్యాంగం, పార్లమెంటరీ అధ్యయనాల సంస్థకు సీనియర్ ఉపాధ్యక్షులు
2013 : ఏ.ఐ.సి.సి. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ శాశ్వత ఆహ్వానితులు
జూన్ 2013 నుండి జౌళి శాఖకు కేంద్ర కేబినెట్ మంత్రి

## సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు

పేదల సంక్షేమం, గ్రామాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరుబావుల తవ్వకం, గ్రామాలలో, మురికివాడలలో సాముదాయక భవనాల నిర్మాణం. ఆంధ్ర మహిళా సభకు హృదయ వ్యాధుల చికిత్సకు భవనాన్ని నిర్మించి ఇచ్చారు. ఛారిటబుల్ సంస్థలను నిర్వహిస్తూ గ్రామీణ పేదలకు మెరుగైన విద్యా సౌకర్యాలను, నిరుద్యోగ యువతకు నైపుణ్యాల పెంపునకు కృషి చేస్తున్నారు.

*కలలను నిజం చేయగల దూరదృష్టి, అంకితభావం కలవాడే నాయకుడు.*

ఆసక్తులు, అభిలాషలు

గ్రంథ పఠనం, సామాజిక సేవ

సందర్శించిన దేశాలు

1987 లో భారతీయ ప్రతినిధి బృందం ఐక్యరాజ్య సమితి పర్యటన. సోవియట్ యూనియన్ మిత్రమండలితో 1987లో చైనాకు ఏ.ఐ.సి.సి. ప్రతినిధుల బృంద సభ్యునిగా 1991లో, చైనాకు బృంద నాయకునిగా, 2006లో, 2008లో భారత పార్లమెంటేరియన్‌గా వరల్డ్ బ్యాంక్ సదస్సుకు ప్రతినిధిగా ప్యారిస్, 2005లో జనాభా - అభివృద్ధి అంశంపై జరిగిన సదస్సుకు, 2006లో వియత్నాం, 2007లో ఇండో కొరియన్ మిత్రమండలి, 2007లో దక్షిణ ఆఫ్రికాను, శ్రీలంక, నైజీరియా (2007), ఇండో-ఇరాన్ పార్లమెంటరీ మిత్రత్వ బృందం, ఇండియా - ఇరాక్ మిత్రత్వ బృందం, అర్జెంటీనా, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, మున్నగు నలభై విదేశాలలో విస్తృతంగా పర్యటించారు.

కావూరి ఛారిటబుల్ ట్రస్ట్, గుడివాడకు ఛైర్మన్

ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, హైదరాబాద్

వృద్ధుల వసతి గృహం, హైదరాబాద్

పలు ఉద్యోగ సంఘాలకు, ట్రేడ్ యూనియన్లకు అధ్యక్షునిగా, ప్యాట్రన్‌గా ఉన్నారు. ఆంధ్రాబ్యాంకు డైరెక్టరుగా 1982 నుంచి 1984 వరకు ఉన్నారు.

న్యూఢిల్లీలోని ప్లానింగ్, ఆర్కిటెక్చర్ సంస్థకు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి, పొగాకు బోర్డుకు, హైదరాబాద్-సాలార్జంగ్ మ్యూజియంకు, దక్షిణ మధ్య రైల్వే జోనులకు, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయానికి, అఖిల భారత సాంకేతిక విద్యా కౌన్సిల్‌కు, వివిధ హోదాలలో సేవలు అందించారు. శాస్త్ర, సాంకేతిక, మేనేజిమెంట్, పరిశోధనా రంగాలలో సంస్థలను నెలకొల్పారు. భారీ నీటి పారుదల, విద్యుత్ ప్రాజెక్టులను, పట్టణాలలో బహుళ అంతస్తుల భవనాలను నిర్మింపజేశారు. *



హాస్టలు ఒక గది దాతలు.. డా॥ అంబటి శ్రీమన్నారాయణ, శ్రీమతి రమాదేవి, కాలిఫోర్నియా



కేంద్రమంత్రి గౌ॥ దగ్గుబాటి పురందేశ్వరి

22 ఏప్రిల్ 1959న నందమూరి తారక రామారావు, శ్రీమతి బసవతారకం గారి బిడ్డగా జన్మించింది. ఇంగ్లీషు, తమిళం, తెలుగు, హిందీ, ఫ్రెంచి భాషలలో అనర్గళ ప్రావీణ్యం కలిగిన ఈ చిన్నమ్మ కూచిపూడి నృత్యంలోనూ కీర్తి ప్రతిష్టలను ఆర్జించింది. జాతిరాళ్ళ నాణ్యతను పరిశీలించగల నైపుణ్యం కూడా పొందింది.

దగ్గుబాటి వెంకటేశ్వరరావు గారి సతీమణి అయి 14వ లోక్‌సభకు బాపట్లనుంచి ఎన్నికై మానవ వనరుల శాఖకు సహాయమంత్రి అయింది. 15వ లోక్‌సభకు విశాఖపట్నం నుంచి ఎన్నికై వాణిజ్యం, పరిశ్రమల శాఖ సహాయమంత్రి అయింది.

పార్లమెంటు వేదికగా తన బహుముఖ ప్రజ్ఞా పాటవాలను ప్రదర్శించింది. పలురకాల సమస్యలపై గళమెత్తి పలికింది. ముఖ్యంగా గృహహింస, హిందూ వారసత్వ బిల్లు వంటి వాటిపై చర్చించింది.

2004-05 సం॥రంలో ఆమె ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఎన్నికైంది. అమెరికా అధ్యక్షుని భార్య లారా బుష్ ఆహ్వానం మేరకు అక్కడకు వెళ్ళి ప్రపంచ అక్షరాస్యతపై ప్రసంగించి ప్రశంసలను అందుకొన్నది. ఈ విశిష్ఠ నేతను శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. భారత ఖ్యాతిని చాటిన ఈమెను పార్టీలకు అతీతంగా అందరూ అభినందిస్తున్నారు.

*ఒక పనిని చేయటం సాధ్యం కాదని చెప్పేవాళ్ళు మన చుట్టూ చాలామంది ఉంటారు. కాని చరిత్ర అంతా వెదకి చూస్తే ప్రయత్నించి చేయవచ్చు అన్నవాళ్ళనుంచే ప్రగతి అంతా సంభవం అయింది.*

# ముప్పవరపు వెంకయ్య నాయుడు
## జీవన రేఖలు



ముప్పవరపు వెంకయ్య నాయుడు 1949లో నెల్లూరు జిల్లాలో చవటపాలెం గ్రామంలోని వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు రంగయ్య, రమణమ్మ గారలు. నెల్లూరులో పట్టభద్రులై, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం చదివారు. అర్ధాంగి శ్రీమతి ఉష, విద్యాభ్యాస కాలం నుండి సామాన్య మానవుని సంక్షేమం పట్ల ఆసక్తి చూపేవారు. ముఖ్యంగా రైతుల, పేదల, అట్టడుగు వర్గాల శ్రేయస్సును కోరుకునేవారు. దీనివల్ల రాజకీయాలలో, సామాజిక సేవా కార్యక్రమాలలో పిన్న వయసు నుండి చురుకైన పాత్ర పోషించాడు. ఎమర్జన్సీని వ్యతిరేకించాడు. నీతి నియమాలతో కూడిన రాజకీయాలకు పెద్దపీట వేశాడు. తన 30 సంవత్సరాల రాజకీయ జీవితంలో పలు కీలక పదవులు నిర్వహించి ఆ పదవులకే వన్నె తెచ్చాడు. సమస్యలను పరిష్కరించటానికి తన గళమెత్తి గర్జించాడు.

1973-74 ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘ అధ్యక్షుడు

1974 ఆంధ్రప్రదేశ్ జనతాపార్టీ యువజన విభాగ అధ్యక్షులు

1978-83 - 1983-85 ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యులు



1980-83 బి.జె.పి. అఖిల భారత యువజన విభాగ ఉపాధ్యక్షులు

1980-85 ఆంధ్రప్రదేశ్ బి.జె.పి. శాసనసభాపక్ష నాయకుడు

1985-88 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బి.జె.పి. జనరల్ సెక్రటరీ

1988-93 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బి.జె.పి. అధ్యక్షులు

1993 - సెప్టెంబర్, 2000 అఖిల భారత బి.జె.పి. జనరల్ కార్యదర్శి

బి.జె.పి. పార్లమెంటరీ బోర్డు కార్యదర్శి

బి.జె.పి. కేంద్రీయ ఎన్నికల కమిటీ కార్యదర్శి

బి.జె.పి. అధికార ప్రతినిధి

1998 ఏప్రిల్‌లో రాజ్యసభకు ఎన్నిక

**భా.జ.ప.**

1998-99 హోమ్ అఫైర్స్ కమిటీ, వ్యవసాయ మంత్రిత్వ శాఖ కమిటీలలో సభ్యులు

1999 డిసెంబరు నుండి ఆర్థిక మంత్రిత్వ శాఖ కమిటీ సభ్యులు

2000 జనవరి నుండి గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ కమిటీ సభ్యులు

30 సెప్టెంబరు, 2000 నుండి జూలై 2002 వరకు గ్రామీణశాఖ కేంద్రమంత్రి

ఇంకా ఆర్థి వ్యవహారాల కేబినెట్ కమిటీ, ఆర్థిక సంస్కరణలు కమిటీలో సభ్యుడు

2002 జూలై నుండి అక్టోబరు 2004 వరకు భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు

2005 ఏప్రిల్ నుండి భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షుడుగా పదవులు నిర్వహించారు

విద్యార్థి నాయకునిగా, రాజకీయ వేత్తగా ప్రముఖ వక్తగా, రైతుల సంక్షేమానికి, గ్రామీణ సమస్యలపైన వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి పోరాడిన యోధుడు వెంకయ్య నాయుడు గారు. అవినీతి, అణచివేతలకు వ్యతిరేకంగా ఎదురొడ్డి పోరాడిన నాయకుడు ఆయన. ఎమర్జన్సీ రోజులలో పౌరుల స్వాతంత్ర్యం, ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం పోరాడి, చాలా నెలలు కఠిన కారాగారవాసం భరించాడు.

విస్తృతంగా చదివే అలవాటుగల ఆయన జాతీయ, ప్రాంతీయ ప్రజా, రాజకీయ సమస్యలపై పలు ఆసక్తికరమైన వ్యాసాలను రాశారు. ఆంధ్ర ప్రదేశ్ బి.జె.పి. అధ్యక్షునిగా తిరిగి గ్రామాలకు వెళదాం అనే నినాదంతో పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్టపరచడానికి ప్రయత్నించారు. ఆ దిశగా మారుమూల గ్రామాలను, ప్రగతికి నోచుకోని పల్లెపట్టులలో విస్తృతంగా పర్యటించారు.

*

---

*చాలామందికి ఏమి చేయాలో తెలుసు. కాని చాలా కొద్దిమంది తమకు తెలిసిన దానిని ఆచరణలో పెడతారు.*

*పరిస్థితులు ఎంత ప్రతికూలంగా ఉన్నా, ఉన్నాయనిపించినా నీ దృష్టిని సారించు, అవకాశాలకోసం వెతుకు. నార్మన్ విన్సెంట్ పీల్.*

# కమ్మ ప్రథమ మహాజన సభ

కవుతరం, కృష్ణా జిల్లా, మార్చి 1911



నిల్చున్నవారు శ్రీయుతులు. 1. వడ్లమూడి గోపాల కృష్ణయ్య 2.మల్లెల నాగేశ్వరరావు 3. .......... 4. రామార్జుననాయుడు 5. యెర్నేని కోనయ్య 6.బొబ్బా పద్మనాభం 7. కొల్లి పద్మనాభం 8. పోలవరపు నాగేశ్వరరావు

కుర్చున్నవారు శ్రీయుతులు. 1.గారపాటి ఆంజనేయులు 2. పాపోలు వీరవెంకయ్య 3. మాగంటి చినసుబ్రమణ్యం 4. ఉప్పలపాటి హేమాద్రి 5. మాగంటి శీతయ్య 6. మల్లెల శివరామ కృష్ణయ్య 7. వీరపనేని బసవయ్య 8. మాగంటి జగన్నాథం

క్రింద కుర్చున్నవారు 1. గుత్తా హరిహరబ్రమ్మం (పరుండిన వారు) మల్లెల శేషగిరిరావు.మాగంటి బాపినీడు (కూర్చున్నది) వెలమాటి పద్మనాభం.

# కాకతీయ సేవాసమితి, వినుకొండ

*డా॥జి.వి.రాయుడు, యం.ఎస్సీ. పీహెచ్.డి. అధ్యక్షులు*






**డా॥ రాయుడు**



**ప్రొ॥ కె. వెంకట్రామయ్య**

వినుకొండలో కాకతీయ సేవాసమితి కులమతాలకు అతీతంగా అందిస్తున్న సేవా కార్యక్రమాలు :

2006 జూలై 1వ తేదీన కాకతీయ సేవా సమితి, బాలికల హాస్టల్ అద్దె భవనంలో 60 మంది విద్యార్థినులతో బొల్లేపల్లి సత్యనారాయణ గారి చేతుల మీదుగా ప్రారంభించబడినది.

అదే సంవత్సరం 40 సెంట్ల స్థలం సేకరణ శ్రీ॥శ్రీ॥ ఘంటా పున్నయ్య, అధ్యక్షులు, కమ్మజన సేవాసమితి గారి సహకారంతో కొనుగోలు చేయడం జరిగింది.

12 వేల చ॥అ॥ భవనాన్ని నిర్మాణం చేసి 30-11-2007 తేదీన మాగంటి మురళీమోహన్ గారి చేతుల మీదుగా ప్రారంభించాము.

విద్యార్థినులకు కంప్యూటర్లు, కుట్టుమిషన్ల విభాగాలను ఏర్పాటు చేసి వంకాయలపాటి బలరామయ్య, గోరంట్ల పున్నయ్య చౌదరి గార్ల చేతుల మీదుగా ప్రారంభించాము.

తర్వాత 6000 చ॥అ॥ మూడవ అంతస్తు ఏర్పాటు చేసి, గ్రామీణ పేద విద్యార్థినులకు తక్కువ ఖర్చుతో ఇంగ్లీషు మీడియంలో నాణ్యమైన విలువలతో కూడిన విద్యను అందించాలనే ఆలోచనతో ఎల్.కె.జి. నుండి 5వ తరగతి వరకు 09-06-2011న కె.లక్ష్మణరావు ఎం.ఎల్.సి., గారు కాకతీయ టెక్నో స్కూలును ప్రారంభించారు.

2011లో వినుకొండ వెల్లటూరు రోడ్డులోని హిందూ స్మశానవాటికను "స్వర్గధామం" పేరున 20 లక్షల రూపాయలతో రెండు కిల్న్‌లతో ఏర్పాటు చేసి ఆధునీకరించాము.

2012లో గంగినేని రామయ్య గారు విరాళంగా యిచ్చిన మూడు కోట్ల రూపాయల విలువైన 10 ఎకరాల స్థలంలో, 3 ఎకరాలలో 'ఆత్మీయం' వృద్ధాశ్రమాన్ని రాయపాటి సాంబశివరావు గారు శంకుస్థాపన చేశారు. వృద్ధాశ్రమాన్ని 100 మందికి ఏర్పాటు చేసి, 30 మంది నిరుపేదలకు ఉచితంగా భోజన ఏర్పాటు చేయాలనే సంకల్పంతో ప్రస్తుతం 4,000 చ॥అ॥ భవనాన్ని అన్ని వసతులు ఏర్పాటు చేసి మార్చి, 2013లో ప్రారంభించాలని సన్నాహాలు చేస్తున్నాం. దీనిలో 2 ఎకరాలలో వివిధ రకాల ఫల పుష్పాల మొక్కలతో వనాన్ని ఏర్పాటు చేశాము.

మిగిలిన 7 ఎకరాలలో కంచి కామకోటి పీఠం వారి ఆధ్వర్యంలో ప్రసూతివైద్యశాలను, ఇంగ్లీషు మీడియంలో రెసిడెన్షియల్ స్కూలు 6 నుండి 12వ తరగతుల వరకు ఏర్పాటు చేయుటకు అంగీకరించారు.

ఇవే కాక 1-6-2006లో కాటూరి మెడికల్ కాలేజి వారి సహకారంతో ఉచిత వైద్య చికిత్సా శిబిరాన్ని నిర్వహించి 500 మంది పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశాము.

16-7-2006లో కాట్రగడ్డ ఫౌండేషన్ వారి సహకారంతో కాట్రగడ్డ లక్ష్మినరసింహారావు గారి చేతుల మీదుగా 2 లక్షల రూపాయల విలువైన సోలార్ ల్యాంపులను ఎస్.సి.,ఎస్.టి.హాస్టల్స్‌కు, జిల్లా పరిషత్ స్కూళ్ళకు ఉచితంగా అందజేశాము.

19-11-2006న శంకర నేత్రాలయం, పెదకాకాని వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి 360 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు చేయించాం.

# విద్యారంగంలో కమ్మ ప్రతిభావంతులు

- పాతూరి కోటేశ్వరరావు

ప్రస్తుత సమాజంలో కమ్మవారు అధిక సంఖ్యలో విద్యావంతులు కావడానికి మూల పురుషులు శ్రీ పాములపాటి కృష్ణయ్యచౌదరి గారు. వారు గుంటూరుజిల్లా బోర్డు ప్రెసిడెంటుగా చేసిన కాలంలో ఆనాటి బ్రిటిష్ పాలకులను ఒప్పించి ప్రతి పెద్ద గ్రామంలో ఒక హైస్కూలు ఏర్పాటు చేయించారు. ఆనాడు కమ్మవారు వ్యవసాయమే ప్రధాన వృత్తిగా ఉన్నప్పటికీ అందుబాటులో స్కూలు సౌకర్యమున్నందు వలన పిల్లలను చదివించారు. ముఖ్యంగా ఊళ్లో స్కూలు, ఆడపిల్లలకు ఒక వరమైంది. లేకపోతే ఆనాటి సామాజిక పరిస్థితులనుబట్టి ఆడపిల్లలను పై చదువులకు పంపించే అవకాశమే లేదు. సమాజంలోని వరకట్న పిశాచం ఏ ప్రభుత్వ చట్టాలు, సంస్కరణల వల్ల రూపుమాప బడలేదు. కేవలం ఆడపిల్ల ఉన్నత చదువులు, సమాన ఉద్యోగ అవకాశాలవల్ల మాత్రమే అది సాధ్యమయింది.

పాములపాటి కృష్ణయ్యచౌదరి గారికి పెద్దగా చదువు లేదు. కానీ తనకున్న అపారమైన లోకజ్ఞానం, బ్రిటిషు వాళ్ళ సహచర్యం వల్ల తడుముకోకుండా ఇంగ్లీషు మాట్లాడేవాడట. అంతటి దక్షతగల కృష్ణయ్యగారు గ్రామీణ విద్యావ్యాప్తికి తోడ్పడ్డారు. ఈ యజ్ఞంలో యింకా ప్రముఖపాత్ర వహించినవారు జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరిగారు, పాలడుగు నాగయ్య చౌదరిగారు, గోనుగుంట్ల బ్రహ్మయ్యగారు. ఈ తరంలో జిల్లా పరిషత్ ఛైర్మన్లుగా చేసిన సక్కుర్తి రామయ్యగారు, రాయపాటి శ్రీనివాస్‌గారు పిన్న వయస్సులో బాధ్యతలు చేపట్టి, ప్రవాసాంధ్రుల ధన సహాయంతో పాఠశాలలను ఉత్తేజింపజేసిన పాతూరి నాగభూషణంగారు అభినందనీయులు.

**మాధ్యమిక విద్య :** 'ప్రయివేటు రెసిడెన్షియల్ విద్యావిధానము' ప్రవేశపెట్టిన యువకుడు లావు రత్తయ్య. ఈ విధానము తల్లిదండ్రులకు ఎంతో ఊరట నిచ్చింది. పిల్లలకు విజ్ఞానాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. జీవితంలో ఉన్నతంగా స్థిరపడేట్లు చేసింది. ఈనాడు పల్లెలు బాగుపడ్డాయంటే వ్యవసాయం వల్ల ఏమాత్రం కావు. ముందు చూపుండి పిల్లలను ఉన్నత చదువులు చదివించి నందువల్లనే సాధ్యపడింది. ఉన్నతంగా స్థిరపడిన పిల్లలు ఊళ్లో ప్రాథమిక అవసరాలకు వారి తల్లిదండ్రుల సమన్వయం ద్వారా సహాయం చేస్తూ సమాజంలో వారి గౌరవాన్ని పెంచుతున్నారు. ఇవన్నీ ఇంటర్మీడియట్ స్థాయిలో, ముఖ్యంగా ఆ యుక్తవయస్సులో అలవాటయ్యే ప్రలోభాలకు, వ్యసనాలకు లోనుకాకుండా శ్రద్ధగా చదువుకున్నందువల్లనే సాధ్యమయింది. ఈ విధానం లాభదాయకంగా తల్లిదండ్రులు, పిల్లలు భావించారు గనుకనే విజ్ఞాన్ సంస్థలతోపాటు, సిద్దార్థ, చైతన్య, గౌతమ్, వికాస్ మొదలగు సంస్థలెన్నో కమ్మయాజమాన్యాల క్రింద ఆవిర్భవించాయి.

మాంటిసోరి విద్యాసంస్థల స్థాపనతో విజయవాడలో ప్రారంభమై స్వయంపాలనా స్థాయికి వృద్ధిచేసి పలు సంస్థలను నెలకొల్పిన డా॥ కోటేశ్వరమ్మగారు మార్గదర్శిగా నిలిచారు. ఆదర్శరీతిలో ప్రారంభించి, వేలాది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన వెంకటేశ్వర బాలకుటీర్ వ్యవస్థాపకురాలు, చైతన్యవంతులై బాలల అభివృద్ధికి సేవాకార్యక్రమాలు చేస్తున్న **చేతన** నిర్వాహకురాలు డా॥ నన్నపునేని మంగాదేవిగారి సేవలు గుంటూరు పరిసర ప్రాంతాలలో పేరెన్నిక గాంచాయి.

**విశ్వవిద్యాలయ ఉప కులపతులు మరియు ప్రొఫెసర్లు :** ఆంధ్రయూనివర్సిటి ఉప కులపతులుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, సర్ కట్టమంచి రామలింగారెడ్డిల వారసుడుగా వచ్చిన డాక్టర్ వాసిరెడ్డి శ్రీకృష్ణ యూనివర్సిటీని ఉత్తమంగా తీర్చిదిద్ది మంచి పరిపాలనా దక్షుడుగా పేరు తెచ్చుకున్నారు. అన్ని విభాగాలు ఆయన కాలంలో విస్తరింపబడి, అభివృద్ధి చేయబడ్డాయి. పదవీ విరమణ చేసిన తరువాత ఎక్కువ కాలం తన ప్రభావం గుర్తుండి పోయేటట్లు ముద్రవేసుకున్న గొప్ప వ్యక్తి. తన పరిపాలనా దక్షత వల్ల ప్రతిష్ఠాత్మకమైన యూనివర్సిటి గ్రాంట్స్ కమిషన్ ఉపాధ్యక్ష పదవిని అధిరోహించ గలిగారు. పదవిలో ఉండగానే పరమపదించారు.



**ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి :** పదహారేళ్ల ఏళ్ల వయస్సులోనే భగవద్గీతకు భాష్యం వ్రాసిన ప్రతిభాశాలి, తత్వశాస్త్రం ప్రత్యేక అంశంగా పరిశోధన చేసిన వ్యక్తి. సర్వేపల్లి రాధాకృష్ణ గారికి అత్యంత ఇష్టుడు. ఆంధ్ర యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా, గుంటూరు పి.జి. సెంటర్‌కు ప్రత్యేకాధికారిగా, యస్.వి. యూనివర్శిటి ఉపకులపతిగా, యూనివర్శిటి గ్రాంట్స్ కమిషన్ ఉపాధ్యక్షులుగా దక్షతతో బాధ్యతలు నిర్వహించిన గొప్పవ్యక్తి. తత్వశాస్త్ర విషయాలలో ప్రపంచంలోనే ఒక గొప్ప గుర్తింపు పొందిన తాత్వికుడు.

ఆచార్య **దావులూరి రామకోటయ్య :** వీరు పుట్టింది పల్నాడు ప్రాంతం. గణితంలో విశేషించి తన కిష్టమైన నియర్ రింగ్స్‌లో ప్రపంచంలోనే ఐదుగురులో ఈయన ఒకరుగా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. పేద విద్యార్థులకు సహాయం చేయడంలో ఈయనకు ఎవరూ సాటిరారు. ఆంధ్ర యూనివర్శిటి, నాగార్జున యూనివర్శిటిలలో ప్రొఫెసరుగా, నాగార్జున యూనివర్శిటి ఉపకులపతిగా యూనివర్శిటి అభివృద్ధికి ఎంతో దోహద పడి కులాతీతంగా గౌరవింపబడ్డారు.

ప్రొఫెసర్లుగా వృక్షశాస్త్ర విభాగంలో **అన్నమనేని శేషగిరిరావుగారు,** తత్వశాస్త్రంలో కోనేరు రామకృష్ణారావు గారు, కంప్యూటర్ శాస్త్ర విభాగంలో **పెనుబోతు త్రిమూర్తిగారు,** తెలుగు భాషా విభాగంలో తూమాటి దొణప్పగారు ఆంధ్రాంగ్ల భాషలలో అగ్రగణ్యుడు **ఎలవర్తి రోశయ్యగారు** గర్వింప దగిన ప్రతిభ ఉన్న వ్యక్తులు.

**స్వయం ప్రతిపత్తి (డీమ్డ్) విశ్వవిద్యాలయాలు**

మన పిల్లలను ప్రపంచస్థాయి పోటీలకు సన్నద్ధం చేయడానికి మరొక నూతన ఆలోచన చేసిన వ్యక్తి కూడా **డాక్టర్ లావు** రత్తయ్య గారే. స్వతంత్ర ప్రతిపత్తి గల విశ్వవిద్యాయాలు, నూతన ఉత్పత్తుల సాధనకు మార్గాన్ని సుగమనం చేస్తున్నాయి. **విజ్ఞాన యూనివర్సిటి** పైన పేర్కొన్న హంగులతో అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యార్థులను ఆకట్టుకొంటున్నది.

కోనేరు లక్ష్మయ్యగారు తన పేరుతో వడ్డేశ్వరంలో ఇంజినీరింగ్ కాలేజి స్థాపించి అత్యున్నత ప్రమాణాలతో నడుపగా, వారి కుమారుడు **కోనేరు సత్యనారాయణ** తండ్రికి మించిన తనయుడుగా ఈతరం ప్రతినిధిగా ఆ సంస్థను **కె.యల్. యూనివర్శిటీ**గా మార్చి అంతర్జాతీయ స్థాయిలో ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దుతూ మంచి ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారు.

ఈ దిశలో మరొక పేరెన్నిగన్న విశ్వవిద్యాలయం విశాఖ పట్టణంలోని మహాత్మాగాంధిగారి పేరుతో **గీతమ్ యూనివర్శిటి**గా ప్రసిద్ధి చెందింది. ఈ సంస్థ స్థాపకులు మతుకుమల్లి వెంకట సత్యన్నారాయణ మూర్తి (యం.వి.యస్ మూర్తి) రాజకీయ నాయకులైనప్పటికి ప్రతిభగల వారిని పరిపాలనలో నియమించి వారికి పూర్తి స్వేచ్ఛనిచ్చి ఉత్తమ విశ్వవిద్యాలయంగా గుర్తింపు తెచ్చారు. ఇతర పట్టణాలలో కూడా స్టడీసెంటర్లను విస్తరింపజేసి విద్యార్థులకు ప్రాంతీయ సౌలభ్యం కూడా కల్పిస్తున్నారు. రాష్ట్రంలో ముందుగా స్థాపించిన ఈ మూడు విశ్వవిద్యాలయాలు మన యాజమాన్యాల క్రింద ఉండటం గర్వింపదగిన అంశం.

**విద్యావ్యాప్తిలో నాగార్జున, సిద్ధార్థ, బాపట్ల అకాడమీలు**

విజయవాడలో ప్రసిద్ధి చెందిన లయోల కాలేజికి దీటుగా సిద్ధార్థ అకాడెమి ఏర్పడి పలు విద్యా సంస్థలు స్థాపించబడ్డాయి. డాక్టరు పిన్నమనేని వెంకటేశ్వరరావు, ఆడిటర్లు బ్రహ్మయ్యగారు, ముమ్మనేని సుబ్బారావుగారు, పాలడుగు లక్ష్మణరావుగారు, ప్రసాద్‌గారు ప్రస్తుతం గుంటూరుజిల్లా వట్టి చెరుకూరు వాస్తవ్యులు యన్. వెంకటేశ్వరరావు గారి ఆధ్వర్యంలో విజయవంతంగా నడుపబడుచున్నాయి. మెడికల్ కాలేజి వారి కీర్తి కిరీటంలో కలికితురాయి.

నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటి, గుంటూరులో కీ.శే. **జాగర్లమూడి చంద్రమౌళి** గారు అధ్యక్షులుగా, కీ.శే. **డాక్టరు కాసరనేని సదాశివరావు** కార్యదర్శిగా స్థాపించబడి 1968లో జె.కె.సి కళాశాల ప్రారంభించారు. దేశ విదేశాలలో స్థిరపడ్డ డాక్టర్లను చూస్తే ఈ కళాశాల ప్రభావం తెలుస్తుంది. ప్రభుత్వ ఉద్యోగులలో ఉన్నతంగా స్థిరపడ్డ ఆఫీసర్లు కళాశాల ప్రభావానికి ఒక ప్రమాణం.

బాపట్ల చిన్నపట్టణమైనా శ్రీ ముప్పలనేని శేషగిరిరావు గారు అనేక విద్యాసంస్థలను స్థాపించి ప్రామాణికమైన విద్యనందిస్తున్నారు. అందమైన, అధునాతన కట్టడాలు ఈ విద్యాసంస్థల ఆభరణాలు.

తెనాలి, నిడుబ్రోలు, అమరావతి, చిలకలూరిపేట, నర్సారావుపేట పట్టణాలలో కూడా మనవారు గర్వించ దగ్గ విద్యాసంస్థలు నడుపుచున్నారు.

